సంపుటి: 3 | సంచిక: 4
మే - జూన్, 2015

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక





# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

దేవుని స్పర్శ పుస్తకము చదువుచున్న మీరు ఎలా ఉన్నారు? ఈ పుస్తకము మ్యాగ్‌జైన్‌గా రెండు నెలలకి ఒకసారి మన దగ్గరకు రావడం మనకు ఆశీర్వాదము అని నమ్ముతున్నాను. దేవుని స్పర్శ ద్వారా ప్రతి ఒక్కరికి మేలు జరగాలని దేవునికి ప్రార్థన చేయుచున్నాను. పొరుగు వారికి మేలు జరగాలని కోరుకునే వారు ఎల్లప్పుడూ క్షేమంగా ఉంటారని బైబిల్ గ్రంథములో దేవదేవుడు తన భక్తుల ద్వారా వ్రాయించాడు.

యోబు తన స్నేహితుల కొరకు ప్రార్థించినప్పుడు క్షేమము, గొప్ప ఆశీర్వాదము పొందినట్లు మనము చూడగలము. క్రొత్త నిబంధన గ్రంథములో పౌలు అనే దైవసేవకుడు తిమోతికి ఉత్తరము వ్రాస్తూ మనుష్యులందరి కొరకు ప్రార్థన చేయడం ద్వారా మనము నెమ్మదిగా, సుఖంగా ఉంటామని తెలియపరిచాడు. కనుక మన జీవితములలో ప్రతి విషయములోను నాకు ఏమి లాభం అనే స్వార్థమును విడిచి, ప్రతి మనుష్యుని క్షేమం కొరకు పని చేయడం, ప్రార్థించడం ద్వారా మనము దేవుని ఉద్దేశ్యం నెరవేర్చిన వారముగా ఉందుము. ఇలాంటి ఆలోచనా విధానము మనుష్యులందరు కలిగి ఉండడం ద్వారా మన సమాజము ఎంతో అద్భుతముగా ఉండగలదు. పాపరహితుడైన యేసుక్రీస్తు మానవాళి కొరకు సిలువ వేయబడడం ద్వారా మానవాళి పాపములన్నింటిని క్షమించి, మనుష్యులు నిస్వార్థముగా బ్రతుకుటకు కావలసిన శక్తిని ఇవ్వగలడని 2000 సంవత్సరముల ప్రపంచ చరిత్రను గమనిస్తే అర్థము అవుతుంది. కనుక మన జీవితములలో కూడా అట్టి అనుభవములను కలిగి జీవించుటకు ప్రభువు సహాయం చేయును గాక!

మీ సహోదరుడు.....



సంపుటి: 3 | సంచిక: 4

మే - జూన్, 2015

# దేవుని స్పర్శ

## ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- దైవ ప్రణాళిక ........ 2
- కిటికి ........ 5
- తిని, తినిపించి.... (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 40వ భాగము ........ 9
- బాల మేధావి (బాలల శీర్షిక) ........ 11
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 13
- మదర్ తెరీసా ........ 15
- సులభమైన ప్రార్థన యొక్క శక్తి ........ 18
- అంతరంగపు కథ ........ 20
- బైబిల్ క్విజ్ - 40 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా:

ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,

భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

# దైవ ప్రణాళిక

బ్రదర్.ఎపఫ్రా

**ఇశ్రాయేలు వారలారా, ఈ కుమ్మరి మంటికి చేసినట్లు నేను మీకు చేయలేనా? ఇదే యెహోవా వాక్కు - జిగటమన్ను కుమ్మరి చేతిలో ఉన్నట్టుగా ఇశ్రాయేలు వారలారా, మీరు నా చేతిలో ఉన్నారు** **(యిర్మీయా 18:6)**



ఒక రోజు దేవుడు యిర్మియాకి కనిపించి, నీవు లేచి కుమ్మరి ఇంటికి వెళ్ళు అని చెప్పడం జరిగింది. దేవుడు చెప్పిన విధంగా అక్కడికి వెళ్ళేసరికి అతడు తన సారె మీద కుండని తయారు చేస్తూ కనిపించాడు. అతని చేతిలో ఉన్న జిగటమన్ను మధ్యలో విరిగిపోయినప్పుడు ఆ కుమ్మరి మరల దానిని తీసుకొని, తనకు నచ్చిన విధంగా ఒక పాత్రను తయారు చేశాడు. దేవుడు యిర్మియాతో కుమ్మరి చేతిలో మట్టి ఎలా ఉందో నా చేతిలో ఈ ప్రజలు అలా ఉన్నారు అని వివరించడం జరిగింది. విరిగిపోయిన వెంటనే కుమ్మరి ఆ జిగట మన్నును పారవేయ లేదు కానీ మరల ప్రయత్నించి తాను ఉద్దేశించిన రూపము లోనికి మరల్చడం జరిగింది. దేవుడు మన విషయములో కూడా ఇదే విధానమును అవలంబిస్తాడు. అయితే ఇక్కడ గమనించవలసిన విషయం కుమ్మరి మనస్సులో ఉన్న శ్రద్ధంతా తన చేతితో మంచి పాత్రలను సిద్ధపరచాలనే కానీ, వేరొకటి కాదు. ఎన్నిసార్లు ఆ మన్ను విరిగిపోయినా దాని తిరిగి మరల తాను కోరుకున్న రూపములోనికి తీసుకు రావడానికి శ్రమిస్తూ ఉంటాడు. దేవుడు మానవుల మైన మనలను కూడా ఆయన కోరుకున్న పాత్రలుగా సిద్ధపరుస్తున్నప్పుడు, మనము అనేకసార్లు తప్పిపోయిననూ, ఎదురు తిరిగిననూ ఆయన ప్రయత్నిస్తూనే ఉంటాడు.

మనలో కొందరు మేము పనికిరాని వారమని, జీవితమంతా వ్యర్థమై పోయిందని, బ్రదుకుట కంటే చనిపోవుట మేలని కృంగి నిరాశ చెందుతూ ఉంటారు. కానీ దేవుడు చెప్పిన వాక్యము వైపు చూస్తే ఎంత నిరాశలో ఉన్నవారికైనా నిరీక్షణ కలుగుతుంది. నీవు ఎన్నిసార్లు

తప్పిపోయినప్పటికి, తప్పిపోయిన పరిస్థితులను గురించి పశ్చాత్తాపపడితే, **మీ పాపములు రక్తము వలె ఎఱ్ఱనివైనను అవి హిమము వలె తెల్లబడును, కెంపు వలె ఎఱ్ఱనివైనను అవి గొఱ్ఱెబొచ్చువలె తెల్లని వగును (యెషయా 1:18)** అని చెప్పిన దేవుని మాటని బట్టి నూతనపరచబడడం జరుగుతుంది.

యేసుక్రీస్తు శరీరధారిగా భూమి మీద ఉన్న దినములలో పేతురు అనే శిష్యుని గురించి లూకా 22:31వ వచనములో **"సీమోనూ, సీమోనూ ఇదిగో సాతాను మిమ్మును పట్టి గోధుమల వలె జల్లించు టకు మిమ్మును కోరుకొనెను"** అని చెప్పెను, 34వ వచనములో **"ఆయన పేతురూ, నీవు నన్నెరు గనని ముమ్మారు చెప్పు వరకు నేడు కోడి కూయదని నీతో చెప్పుచున్నా ననెను".** అందుకు పేతురు నేను అబద్దమాడను అని గట్టిగా చెప్పడం జరిగింది. అవస రమైతే నీ కోసం చని పోతాను అనే తీర్మానం కూడా చేశాడు. కొన్ని దినములు జరిగేసరికి అర్ధరాత్రి యేసుక్రీస్తుని పట్టు కొని సైనికులు ఈడ్చుకొని పోతూ ఉండగా, ప్రభువు చెప్పి నట్లు గానే పేతురు ఆ రాత్రి యేసు ఎవరో తెలియదని ముమ్మారు అబద్ధం చెప్పడం జరిగింది. వెంటనే కోడి కూసింది, ప్రభువు ముందు గానే చెప్పిన మాటలని జ్ఞాపకం చేసుకొని పేతురు ఎంతో దుఃఖిం చాడు.



నేను ఊహించినట్లుగా జీవితములో జరగలేదని, దేవుడు కోరుకున్నట్లుగా బ్రతుక లేకపోయానని, ఎన్నో ప్రసంగ ములు విన్నాను, అనేక తీర్మాన ములు చేసుకున్నాను కానీ నేను వాటిని పాటించ లేకపోయాను. ఇంక నేను పనికిరాను, ఏ మాత్రం దేవుడు నన్ను క్షమించరని లేని పోని అపోహలతో బ్రదుకుతున్నావా? అయితే పేతురుని చూడు! ఏ బోధకుడు బోధించలేని అద్భుతమైన బోధలు యేసు నోట విన్నప్పటికి, ఆయనతో పాటుగా కలిసి జీవించినప్పటికి ఒకానొక సమయములో ఆయన ఎవరో తెలియదని ముమ్మారు గట్టిగా చెప్పి చాలా పెద్ద తప్పు చేశాడు. అయినప్పటికి ప్రభువు పేతురు జీవితములో కలిగిన

అపజయమును కూడా శిక్షణలో భాగంగానే తలంచాడు. పేతురులోని నేను అనే అహంభావం చనిపోయి, నా వల్ల ఏమీ కాదు, అనే స్థితికి చేరుకున్నాడు. మన ఉద్రేక పూరితమైన స్వభావం, స్వంతజ్ఞానం అన్నీ సున్నా అయినప్పుడే దేవుడు తన ఉద్దేశ్యమును మన జీవితములో నెరవేర్చుకుంటారు.

ఆ తరువాత దినములలో పేతురు జీవితమును దేవుడు ఎంత బలంగా వాడుకున్నారో చూస్తే, మూడు సార్లు ఆయన ఎవరో తెలియదు అని అబద్దమాడిన వ్యక్తేనా ఇతను అని ఆశ్చర్యం కలగక మానదు.

ప్రియ సహోదరి! సహోదరుడా! కుమ్మరి చేతిలో మన్ను ఎలా అయితే ఉందో దేవుని చేతిలో నీవు కూడా అలాగే ఉన్నావని విశ్వసిస్తే, నీ జీవితంలో దేవుడు గొప్ప అద్భుతం జరిగిస్తాడు. కుమ్మరి చేతిలో మన్ను విడిపోయినట్లుగా నీవు ఎన్నిసార్లు దేవుడు చేసిన ప్రయత్నములలో తప్పిపోయినా, నీ కోసం మరియొక అవకాశం సిద్ధంగానే ఉన్నది. కనుక బ్రదుకు దినములన్నిటిలో నిరీక్షణ అనేది కోల్పోవద్దు.

**"నీవు ఆయన చేతిలో ఉన్నావు, ఆయన నిన్ను తప్పక ప్రయోజనకరమైన పాత్రగా సిద్ధపరుస్తాడు"**

అట్టి ధన్యత దేవుడు నీకు దయచేయును గాక !

## ఇది మీకు తెలుసా?

**క్రొత్త నిబంధన పాత నిబంధన కంటె ఎంతో గొప్పది.**

**"ఈయన మరియెక్కువైన నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు" (హెబ్రీ 8:6)**

అనేక మంది క్రైస్తవులకు పాత నిబంధనకు మరియు క్రొత్త నిబంధనకు మధ్య ఒక ప్రధానమైన వ్యత్యాసముందని తెలియదు.

పాత నిబంధన ఒక వ్యక్తి యొక్క బాహ్య జీవితమును శిక్ష యొక్క భయము చేత కాని లేక ప్రతిఫలము యొక్క వాగ్దానము చేత గాని శుద్ధిపరచును. అయితే క్రొత్త నిబంధన ప్రేమ కలిగిన స్వభావమైన యేసు క్రీస్తు స్వభావాన్ని పరిశుద్ధాత్ముడు మనకిచ్చుట ద్వారా మనలను మార్చును.

పందిని గొలుసులతో బంధించి శుభ్రముగా ఉంచవచ్చును.ఒక పిల్లి తన స్వభావ సిద్దముగా శుభ్రముగా నుండును. ఈ ఉదాహరణ రెండు నిబంధనల మధ్యనున్న వ్యత్యాసాన్ని తెలుపును.



# కిటికి
## (Window)

ఒక కాలనీలో రెండు కుటుంబములు ఉండేవి. వారు నివసించే ఇళ్ళు ఒక దానికి ఒకటి ఎదురుగా ఉండేవి. ఒక ఇంటి కిటికీలో నుండి చూచినప్పుడు ఎదురింటి బాల్కానీలోని వాష్‌బేసిన్ కనబడుతూ ఉండేది. ఆ ఇంటావిడ ప్రతి రోజూ ఎదురింటి వాష్‌బేసిన్‌ను తన భర్తకు చూపిస్తూ ఆవిడకి అస్సలు శుభ్రం లేనట్లుంది, వాష్‌బేసిన్ ఎంత మురికిగా ఉందో చూడండి అని చెబుతూ ఉండేది. ఈ విధముగా ప్రతిరోజూ ఉదయమునే బాల్కానీ వైపు చూస్తూ తన భర్తకు ఎదురింటావిడ అశుభ్రం గురించి పదే పదే చెప్పడం అలవాటుగా మారింది. ఆమె భర్త ఏమీ మాట్లాడేవాడు కాడు. నెలరోజులు గడిచిన తరువాత ఓ రోజు నిద్ర లేచి అలవాటుగానే ఎదురింటి బాల్కానీ వైపు చూచి, ఆమె ఆశ్చర్యపోయింది. తన భర్తను పిలిచి రోజూ నేను ఎదురింటావిడ గురించి అంటున్న మాటలు ఆవిడతో ఎవరైనా చెప్పారేమో ఆవిడ వాష్‌బేసిన్‌ని చాలా శుభ్రం చేసింది అని అంది. అప్పుడు భర్త నెమ్మదిగా ఎదురింటావిడ వాష్‌బేష్‌సిన్‌ను శుభ్రం చెయ్యలేదు కానీ నేనే ఉదయము మన కిటికీ అద్దాలను శుభ్రపరిచాను అని చెప్పేసరికి ఆమెకు కనువిప్పు కలిగింది.

ప్రియమైన వారలారా! ఇది అర్థం అయ్యిందనుకుంటాను. ఆమె తన ఇంటి కిటికీ అద్దాల సంగతి, అనగా వాటికి ఉన్న మురికి గురించి పట్టించుకోకుండా, వాటిలో నుండి ఎదురింటి వాష్‌బేసిన్‌ను చూచినప్పుడు అది మురికిగా కనిపించేది. మన హృదయం యొక్క పరిస్థితి కూడా ఇంతే. మాలిన్యమును, మురికిని, అపరిశుద్ధతని హృదయములో దాచుకొని, ఆ హృదయముతోనే ఎదుటి వారిని చూచి, అన్నిటినీ అనుమానిస్తూ, మనల్ని మనం పరిశీలించుకొనకుండా జీవిస్తూ ఉంటాము. ఎప్పుడైతే వాక్యపు వెలుగులో మన హృదయమును పరిశీలించుకొని, అపరిశుద్ధతను అశుభ్రతను తొలగించుకుంటామో, తేట కలిగిన హృదయముతో ఎదుటి వారి క్రియలను పరిశీలించి మనిషిలోని పాపమును ద్వేషించి, మనిషిని ప్రేమించగలిగే వారిగా ఉంటాము. ఎప్పుడూ మన తప్పు ఆలోచనలను బట్టి ఎదుటి వారు కూడా ఇంతే అని తీర్పు తీర్చే స్థితిలోకి వెళ్ళక, హృదయంలో విశాల భావమును కలిగి ఎదుటి వారిని ప్రేమిద్దాం.

# తిని, తినిపించి......

సిస్టర్ వి.విజయ

**స్త్రీ ఆ వృక్షము ఆహారమునకు మంచిదియు, కన్నులకు అందమైనదియు, వివేకమిచ్చు రమ్యమైనదియునై యుండుట చూచినపుడు ఆమె దాని ఫలములలో కొన్ని తీసికొని తిని తనతో పాటు తన భర్తకును ఇచ్చెను, అతడు కూడా తినెను. (ఆది.కా.3:6)**

ఆదియందు దేవుడు సృష్టి అంతటిని అనగా భూమి ఆకాశములను, పగటిని, రాత్రిని, సూర్య, చంద్ర, నక్షత్రములను, జలములను, జలచరములను, భూమి మీద ప్రాకు ప్రతి పురుగును గడ్డిని, విత్తనములిచ్చు చెట్లను ఫలవృక్షములు గల చెట్లను, పశువులను, అడవి జంతువులను కలుగును గాక అని నోటి మాట ద్వారా పలికి అన్నిటిని సృజించెను. అంతయూ మంచిదని దేవుడు చూచెను. తరువాత దేవుడు ఆయన పోలికతో నరుని సృజించవలెనని అనుకొనెను. దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవ వాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను. మరియు దేవుడైన యెహోవా ఏదేనులో ఒక తోట వేసి చూపునకు రమ్యమైనదియు, ఆహారమునకు మంచిదియునైన ప్రతి వృక్షమును, ఆ తోట మధ్యను జీవ వృక్షమును, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షమును నేల నుండి మొలిపించెను. మరియు దేవుడైన యెహోవా నరుని తీసికొని ఏదేను తోటను సేద్యపరచటానికి కాచుటకు దానిలో ఉంచెను. ఈ తోటలోనున్న ప్రతి వృక్షఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చును. అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినకూడదు నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరునికి ఆజ్ఞాపించెను. ఆ.కా. 2:16,17 ఆదాము యొక్క ప్రక్కటెముక నుండి స్త్రీనిగా నిర్మించి వారిని దేవుడు ఫలించి, అభివృద్ధి పొంది, విస్తరించి, భూమిని నిండించి దానిని లోపరుచు కొనమని ఆశీర్వదించెను. వారు ఏదేను తోటలో ఉంచబడిరి.



దేవుడు చేసిన జంతువులన్నిటిలో సర్పము యుక్తిగలదై యుండెను. ఆ సర్పములోనికి ప్రవేశించిన అపవాది ఆ స్త్రీతో ఇది నిజమా? ఈ తోట చెట్లలో దేని ఫలములనైననూ మీరు తినకూడదా? అనే అపోహను కలిగించి, మీరు వాటిని తినవచ్చు వాటిని తిను దినమున మీ కన్నులు తెరువబడుననియు, మీరు మంచి చెడ్డలను ఎరిగిన వారై దేవతలవలె ఉందురనియు దేవునికి తెలియునని స్త్రీతో చెప్పగా! ఆది 3:5 అప్పుడు ఆస్త్రీకి ఆ వృక్షఫలము కనబడిన

విధము  మూడు  రకములుగా కనబడుచున్నది.

**1. ఆహారమునకు మంచిదియు:** హవ్వ కన్నులకు ఆ వృక్షఫలము ఆహారమునకు మంచిదిగా అనిపించింది అని బైబిల్ గ్రంథము చెపుతుంది. దేవుడు వారు తినటానికి అనేక రకములైన వృక్షఫలములు ఇచ్చినప్పటికీ, ఆ స్త్రీకి తినవద్దు అని చెప్పిన ఒకే ఒక్క వృక్షము యొక్క పండు మాత్రమే ఆహారమునకు మంచిదిగా అనిపించింది. శరీరమునకు తినవలెనని కోరిక కలుగుచుండగా దానిని జయించక శరీరాశకు లోబడిపోయింది. మన జీవితములో మనము ఉన్న స్థితిని బట్టి సంతృప్తిని కలిగి సంతోషించుచూ అన్ని విషయములలో దేవునికి స్తుతి చెల్లించమని వాక్యము చెప్పుచుండగా, ఉన్న వాటిని వదిలివేసి, లేని వాటి కొరకు ఆశపడుచూ, పొందనపుడు నిరాశలలోనికి వెళ్ళుచూ, కుటుంబములో సంతోషము, సమాధానమును కోల్పోయే వారిగా ఉంటాము. ఈ శరీరము మనల్ని మనము తగ్గించుకోవటానికి, ఇతరులను క్షమించటానికి ఎంత మాత్రమూ లొంగదు. ఇతరులు ఉన్న స్థితిని చూచి, వారి అనుభవములను చూచి, వారి సంతోషము చూసి,  అసూయ పడమని, ద్వేషము పెంచుకోమని, కోపమును హృదయంలో  ఉంచుకోమని ప్రోత్సహిస్తూ ఉంటుంది. నువ్వేమీ తప్పుచేయలేదులే అని సమర్థిస్తూ ఉంటుంది. అయితే మనము ఒక్కసారి ఆలోచించి శరీరము మనలను లోపరుచుకునేదిగా కాక మనము శరీరమును లోపరుచుకునే వారిగా ఉండుట వలన మాత్రమే దేవునిలో ఆశీర్వాదమును చూడగలము.

**2. కన్నులకు అందమైనది:** ఆ తోటలో అనేక వృక్షఫలములు ఉన్నప్పటికీ ఆ వృక్ష ఫలము మాత్రమే అందముగా కనిపించింది. ఈ లోకము, లోకములోనివన్నియు మన కన్నులకు అందముగా కనిపిస్తాయి. లోకములోని వస్తువులను, ఆభరణములను చూచిన వెంటనే ఇది నాకు కావాలి అనే మనసుతో అది పొందే వరకు విడిచిపెట్టని వారముగా ఉంటాము. కనులకు నచ్చినవన్నీ కావాలి అని కోరుకునే వారిగా ఉండకూడదు. నేత్రాశ కలిగిన వారమైతే ఏది మన కనుల ముందు కనబడితే అది నాకు కూడా ఉంటే బావుండు అని అనిపిస్తుంది. నేత్రాశ వలన మనము చూచినవి పొందలేనపుడు, నిరాశ కలిగి, హృదయములో సమాధానమును పాడుచేసుకొనుట మాత్రమే కాకుండా, అవి కలిగిన వారిని చూచినపుడు మన హృదయములో ఈర్ష్య, ద్వేషము పుట్టి దేవునికి విరోధముగా పాపము చేస్తున్న వారిగా ఉన్నాము. అందుకే మన జీవితములో కన్నులుండియూ లేని వారముగా ఉండుట ఎంతో మంచిది.

**3. వివేకమునకు రమ్యమైనది :** హవ్వ సర్పము చెప్పిన మాటలను బట్టి ఆ పండు తింటే నేను దేవతనవుతాను అని ఊహించుకున్నదే గాని, నాకు ఈ మాటలు చెప్పుచున్న సర్పము ఎవరు? ఎక్కడ నుండి వచ్చింది? ఎందుకు చెపుతుంది? అని ఆలోచించలేకపోయింది. ఆ దినము నుండి నేటి వరకు స్త్రీలమైన మనము ఎదుటి వారు పొగడ్తలతో ముంచెత్తుతూ, ఘనపరచగానే మనలను మనం మరచిపోయి, జ్ఞానము లేని నిర్ణయములు తీసుకుంటూ ఉంటాము. ఒక స్త్రీగా

మనము ఎల్లప్పుడూ మన స్థితి ఏమిటి ? మనకి ఉన్న బాధ్యతను ఎలా నెరవేర్చాలి ? అనే ఆలోచనతో జీవించవలసిన వారమై యున్నాము. యెహోవా యందు భయభక్తులు గల స్త్రీ కొనియాడబడును అని బైబిల్ గ్రంథము చెప్పినట్లు మన మాటలు, నిర్ణయములు, పనులు ఆయన యందు భయభక్తులు కలిగి చేయుట ద్వారా కొనియాడబడతాము



హవ్వతో సర్పము మీరు ఆ పండు తినుదినమున దేవతలవలె మారిపోతారు అని చెప్పిన మాటను బట్టి దేవుడు ఇచ్చిన ఆజ్ఞను మీరి ఆ పండుని తినటానికి సిద్ధపడి, ఆమె తిని ఆమె భర్తకును ఇచ్చి ఈ సృష్టిలో పాపము ప్రవేశించటానికి కారణమయ్యారు. మనము దేవుని వలన పొందిన ఆజ్ఞను ఎన్నడూ మీరుటకు ఇష్టపడకూడదు. దేవుని ఆజ్ఞకు విరోధమైనవి ఎంతో మంచివిగా అనిపించినప్పటికీ, అందమైనవిగా కనిపించినప్పటికీ, రమ్యమైనవిగా తోచినప్పటికీ మనము ఎన్నడూ అట్టివాటిని చేయుటకు మనసులోనైననూ అంగీకరించకూడదు. హవ్వ మోసపరచబడి అపరాధములో పడినట్లుగా మనము పడక, సాతాను తంత్రములను ఎరిగిన వారమై మన బ్రదుకు దినములన్నిటిలో దేవుడు మనకి ఇచ్చిన ఆజ్ఞలను గైకొనుచూ మన కుటుంబమును ఆ మార్గములలో నడిపిస్తూ ముందుకి కొనసాగుదాము..

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.


ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com


**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 40వ భాగము**



దక్షిణ భారతదేశములో సువార్త పరిచర్యకు బయలుదేరాడు సుందర్. అయితే దక్షిణాది భాషలను సుందర్ మాట్లాడ లేకపోయేవాడు. అంతేకాక ఆయనకి ఉన్న ఆంగ్లభాషా పరిజ్ఞానమూ తక్కువే. అందువలన విద్యావంతులతో మాట్లాడడం కూడా కష్టంగా ఉండేది. పూనా చుట్టుప్రక్కల ఉన్న సంఘములు సాధువుని చూడాలని, ఆయన మాటలను వినాలని ఎంతో ఉత్సాహమును కనబరచడం వలన సుందర్‌సింగ్ మాటలను స్థానిక భాషలోనికి అనువదించగల వ్యక్తి అవసరమయ్యాడు. పూనాలో కాలేజీలో చదువుతున్న విన్సెంట్ డేవిడ్ హిందుస్థానీ అనర్గళంగా మాట్లాడగలడు. సుందర్‌సింగ్ హిందుస్థానీలో మాట్లాడేవాడు గనుక క్రైస్తవ విశ్వాసము వారు హిందుస్తానీ పరిజ్ఞానము గల విన్సెంట్‌ను సుందర్‌కు ద్విభాషిగా ఎంపిక చేశారు. కాబట్టి విన్సెంట్ సాధువుతో కలిసి వెళ్తూ అన్ని స్థలములలోను, పెద్ద పెద్ద కూటములలోను ఆయనకు తర్జుమా చేస్తుండేవాడు. సుందర్‌ని ప్రజలందరూ సాధువుగానే గుర్తించారు. సాధువు ఎక్కడికి వెళ్ళినను, ఆయనతో మాట్లాడాలనీ ఆయన తమను చూచి చిరునవ్వు నవ్వితే చూచి తరించి పోదామని, ఆయనతో కరచాలనం చేద్దామని ప్రజలు గుంపులు గుంపులుగా గంతులేసుకుంటూ వచ్చి ఆయన చుట్టూ చేరేవారు. దీని తరువాత 30 సంవత్సరములకు ముంబాయి క్రైస్తవ సంఘంలో విన్సెంట్‌గారు ప్రఖ్యాతి గాంచిన వాడైనప్పటికిని ఆనాటి మధుర గుర్తులను ఎంతో స్పష్టంగా చెప్తుండేవారు అవి ఆయన జీవితముపై చెరగని ముద్ర వేశాయి.

సాధుసుందర్ సింగ్ చూడడానికే విలక్షణంగా కనిపించేవాడు. మంచి ఎత్తు దేహదారుఢ్యం కలిగి పొడవాటి గడ్డం, కాషాయ వస్త్రములు ధరించి ఓ శాలువా భుజాన్న వేసికొన్న సాధువుని రైలు బండి దిగుచున్నప్పుడు గాని, గదిలోనికి వెళ్ళుచున్నప్పుడు గాని ఆయనకై ఎదురు చూస్తున్నవారు ఒక్కసారిగా నిశ్శబ్దమై పోయేవారు. ఆయనను చూచినపుడు యేసుప్రభువు వారికి గుర్తు వస్తుండేవారు. కేవలం అతని వస్త్రధారణను బట్టి వారిలా తలంచారనుకుంటే పొరబాటే. కాషాయ వస్త్రములను ధరించిన సాధువులను వారు ఎప్పుడూ చూస్తుండేవారు. ఆ సాధువుల్లో కొందరు ఎంతో అపరిశుభ్రంగాను, అసహ్యం గాను ఉండినందున వాళ్ళను చూస్తే చాలు పిల్లలు భయముతో బిగుసుకుపోయేవారు. కాని

సుందర్ విషయములో అలా కాదు. ఆయన ప్రసంగిస్తున్నాడని తెలియగానే వర్తమానం వినాలన్న ఆశతో విద్యార్థులు గుంపులు, గుంపులుగా వచ్చేవారు. పెద్దలూ అలాగే వచ్చేవారు. సుందర్‌ని చూచి కాదు గాని ఆయన సామాన్యమైన నిరాడంబర జీవితమును, ఆసక్తిని చూచి ప్రజలు ఆకర్షితులైనారు. ఆయన ప్రార్థన, ఆ ప్రార్థనలో ముగ్దుడైపోవడాన్ని, ఆయన ప్రశాంత జీవితమును చూచి భారతీయులు ఎంతో ముగ్దులైపోయారని సెయింట్ జాన్ సంస్థకు చెందిన ఓ సహోదరి చెప్పారు. అంతే కాదు సాధువు వీరికి విగ్రహమైపోయాడని ఆమె విమర్శించింది. ఆ సంస్థకు చెందిన ఓ ఫాదర్ సుందర్‌ను టీ కి ఆహ్వానించి ఈ విషయమై గట్టిగానే ఆయనతో వాదించాడు. క్రీస్తు కొరకు సుందర్ చేయుచున్న సేవను అభినందిస్తూనే సాధువు అని మీరు ఎందుకు పిలిపించుకుంటున్నారని అడిగాడు. ప్రజలు సాధువు అని నన్ను పిలవడం నాకు ఇష్టం లేదు. సుందర్‌సింగ్ అని పిలిస్తే అదే నాకు సంతోషం. నేను వ్యత్యాసమైన జీవితం జీవించడం వలన నా మీద గల అభిమానం కొద్దీ వారు నన్ను సాధువు అని పిలుస్తున్నారు. అయితే సాధువు అంటే పరిశుద్ధుడని అర్థం కాదు. సాధువు అంటే సాధన చేసేవాడు. సాధన అంటే ఓ రకమైన ప్రార్థన, భక్తి అని సుందర్ బదులు చెప్పాడు. అయితే ఆ సమాధానం ఫాదర్‌ని తృప్తిపరచలేదు. యేసుప్రభువును 'సద్భోధకుడా!' అని పిలిచినప్పుడు నన్ను సత్పురుషుడని ఏల చెప్పుచున్నావు దేవుడు ఒక్కడే సత్పురుషుడని ఆయనే చెప్పారు గదా! అన్నప్పుడు ఈ లోకములో ఎవ్వరినీ ఫాదర్ (తండ్రి) అని పిలవవద్దు పరలోకమందున్న దేవుడు ఒక్కడే మీకు తండ్రి అని కూడా యేసుప్రభువు చెప్పారని సుతిమెత్తగా అంటించాడు సుందర్. అయిననూ మీ మీద ఉన్న గౌరవం కొద్ది మిమ్ములను ఫాదర్ (తండ్రి) అని పిలుస్తున్నాము. అంతే కాకుండా ఈ బిరుదును మీరు అంగీకరిస్తున్నారు. నిజానికి ఈ సంభాషణ అంతా ఎలాంటి ఘర్షణ లేకుండా సుహృద్భావ వాతావరణములోనే జరిగింది. ఆ తరువాత తమ సంస్థ కార్యకలాపాలను వారు సుందర్‌కు చూపించారు. పనులను ఎంతో మెచ్చుకున్నాడు సుందర్ మరి విశేషముగా శిశు సంరక్షణ శాఖలో పసి పిల్లలను వారు చూచుకుంటున్న విధానాన్ని చూచి మెచ్చుకోకుండా ఉండలేక పోయాడు. పిల్లల పట్ల ఇంత శ్రద్ధ తీసుకోవడం మరెక్కడా నేను చూడలేదని విన్సెంట్‌తో సాధువు అన్నాడు. తనను ఆహ్వానించిన వారి సాంప్రదాయానుసారంగానే అచటి గుడిలో ప్రవేశించి ఆ తరువాత ప్రార్థనలో తన చేతులు ఎత్తి ఆయన సంఘం రెండవ రాకడ వరకు నిలిచి ఉంటుందని చెప్పాడు. సగం హృదయంతో పని చేయడానిని, వేషధారణను ఆయన ఎంతో తీవ్రంగా ఖండించడమే గాక యధార్థతను ఎవరిలో చూచినా, చివరకు క్రైస్తవేతరులలో చూచినను గౌరవించారు.

సేకరించబడింది

(ఇంకా ఉంది)



# బాల మేధావి

హాయ్ పిల్లలు! ఎలా ఉన్నారు? హాలిడేస్ కదా బాగా ఎంజాయ్ చేస్తున్నారా? ఏంటి? ఇంకా లేదా? ఎక్కడికి వెళ్ళాలి? ఎలా ఎంజాయ్ చేయాలి అని ప్లాన్స్ వేస్తున్నారా? కొందరు ఇప్పటికే అమ్మమ్మ ఇంటికో, నాయనమ్మ ఇంటికో చెక్కేసి ఉంటారు కొందరు ఇతర బంధువుల ఇంటికి లేక ఇంకెక్కడికైనా వెళ్ళుంటారు కదా!

పిల్లలు మీరు ఎక్కడ ఉన్నా మీ హెల్త్ జాగ్రత్త సుమా! ఎందుకంటే ఎండలు చాలా ఎక్కువగా ఉన్నాయి. వాటర్ ఎక్కువగా తాగండి. ఇంకా ఈ హాలిడేస్ స్వీట్ మెమోరీస్‌గా ఉండాలని ప్లాన్ చేసుకోండి. బాల్యంలో నీ మనోఫలకం మీద వ్రాయబడిన సంగతులు మీ జీవితకాలమంతా మిమ్ములను ప్రభావితం చేస్తాయని మీకు తెలిసా? కాబట్టి అత్యున్నతమైన వ్యక్తిత్వము కలిగిన యేసుని ధ్యానించవలసిందిగా కోరుచున్నాను. నేను చెప్పింది గుర్తుంటుందిగా. ఇప్పుడు ఒక చక్కటి కథని చదువుకుందాము.

అవంతి దేశాన్ని చంద్రకాంతుడు అనే రాజు పరిపాలించేవాడు. ఆయన పుట్టిన రోజు వేడుకలు చాలా ఘనంగా జరిగేవి. చంద్రకాంతుడు స్వయంగా ఆ వేడుకలలో పాల్గొంటాడు. ప్రజలకు తమ రాజును స్వయంగా చూసే అవకాశం ఆ ఒక్కరోజే వస్తుంది. ఎప్పటిలాగే ఆ సంవత్సరం కూడా అవంతి దేశపు ప్రధాన నగర ప్రజలంతా ఒక విశాలమైన మైదానంలోకి చేరుకుని తమ రాజుగారి పుట్టినరోజు వేడుకలు జరుపుకోసాగారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రజలను సంతోషపరచటానికి రాజఆస్థానపు ఉద్యోగులు రకరకాల పోటీలు పెట్టి గెలిచిన వారికి మంచి బహుమతులు ఇవ్వసాగారు.

కౌశిక్ పది సంవత్సరాల కుర్రాడు. తన తండ్రితోపాటు ఆ వేడుకలకి వచ్చాడు. తను కూడా ఏదైనా పోటీలో పాల్గొనాలనే ఉత్సాహంతో మైదానమంతా కలియతిరుగుతున్నాడు. ఒకచోట ఎదురెదురుగా ఇద్దరు వ్యక్తులు కూర్చుని ఉన్నారు. వారి చేతులు నిటారుగా బిగుసుకుపోయేలా మోచేతుల దగ్గర చెక్కముక్కలు కట్టి ఉన్నాయి. వారు తమ చేతులను నిలువుగా కదల్చగలరు కానీ ముడుచుకోలేరు. ఇద్దరి ముందు చెరో పాయసం ఉన్న పాత్ర ఉంది.

పోటీ నిర్వహిస్తున్న రాజోద్యోగి ఇలా చెప్పాడు " ఎవరి పాయసం వారే త్రాగాలి. ఒక చుక్క కూడా కింద ఒలకడానికి వీలు లేదు. ఈ షరతులకు లోబడి పోటీ చేసి, గెలిచిన వారికి మంచి బహుమతి ఇవ్వడం జరుగుతుంది".

ఆ ఇద్దరు వ్యక్తులు తమ చేతులతో తాగడానికి ప్రయత్నించారు, కాని నోటి దగ్గరకు తెచ్చుకోలేకపోతున్నారు. కొద్దిసేపు ప్రయత్నించాక చేసేదేమీలేక పోటీ నుండి పక్కకు తప్పుకున్నారు. "మరెవరైనా పోటీలో పాల్గొనాలి" అంటూ గట్టిగా అరిచాడు రాజ ఉద్యోగి. చుట్టూ మూగి ఉన్న జనానికి కూడా పాయసం తాగే పద్ధతేమిటో బోధపడలేదు. అందుకే ఎవరూ ముందుకు రావడానికి సాహసించలేదు.

"నాన్న మనం ఈ పోటీలో పాల్గొందామా??" అని అడిగాడు కౌశిక్. "వద్దురా. పాయసం ఎలా తాగాలో నాక్కూడా తెలీదు. ఓడిపోతాం" అని జవాబిచ్చాడు తండ్రి. "మనం గెలుస్తాం. రా నాన్నా!" అంటూ కౌశిక్ తండ్రి చెయ్యి పట్టుకుని బలవంతంగా ముందుకు లాక్కుపోయాడు.

ఇక తండ్రికి కొడుకుతోపాటు పోటీలో కూర్చోక తప్పలేదు. వారిద్దరి మోచేతులకు చెక్క ముక్కలు పెట్టి కట్టేశాడు. అయోమయంగా చూస్తున్న తండ్రితో కొడుకు, "కంగారు పడకు నాన్నా. నా పాయసం గిన్నెను నీ చేతిలోకి తీసుకొని నాకు తాగించు. అలాగే నీ పాయసాన్ని నేను నీకు తాగిస్తాను" అన్నాడు. తండ్రి కొడుకు చెప్పినట్లే చేసాడు. పాయసం గిన్నెను కౌశిక్ నోటికి అందించాడు. ఈ దృశ్యం చూసి ఆ కుర్రవాడి తెలివితేటలకు జనం ఆశ్చర్యపోయారు. వెంటనే ఆనందంగా, అభినందనగా చప్పట్లు చరిచారు. చప్పట్ల శబ్దంతో ఆ ప్రదేశమంతా మారు మ్రోగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న చంద్రకాంత రాజు స్వయంగా అక్కడికి వచ్చాడు.

"భళా, పిన్న వయసులోనే గొప్ప తెలివితేటల్ని, సమయస్ఫూర్తిని ప్రదర్శించావు. అమోఘం! ఇక నుంచీ నీ సంరక్షణ బాధ్యత మేము తీసుకుంటున్నాము. మంచి చదువు చెప్పించడమే కాకుండా నువ్వు పెద్దయ్యాక మా రాజ్యానికి అంతరంగిక ముఖ్య సలహాదారుగా నియమిస్తాం" అంటూ ఆప్యాయంగా కౌశిక్ భుజం తట్టాడు చంద్రకాంతుడు.

మీరు కూడా అలా ప్రశంసలు పొందాలని చెబుతానని అనుకుంటున్నారా, కాదు. తెలివి తేటలు, సమయస్ఫూర్తి ఒక్కొక్కరికి వేర్వేరు స్థాయిలలో ఉంటాయి. కనుక మనకి గెలిచిన వారిని అభినందించే విశాల హృదయం మనకి కావాలి. కేవలం మాటలతోనే కాకుండా, హృదయములో కూడా ఆ విశాలత ఉండాలంటే కేవలం నిన్ను సృష్టించిన సృష్టికర్త అయిన దేవుడు మాత్రమే అనుగ్రహించగలడు. కాబట్టి బాల్య దినముల నుండే నీ సృష్టికర్తని స్మరణకి తెచ్చుకొనుము. అప్పుడు ఆయన తప్పక నీకు ఆ విశాల హృదయమును అనుగ్రహిస్తాడు. బాల్య దినముల యందే మీరు దేవుని కృపను పొందాలని ఆశిస్తూ.......

ప్రేమతో మీ అక్కయ్య .....

# "నా జీవితములో దేవుని మేలులు"

**టి.జితేంద్రాచారి, గోరెంట్ల**

నా పేరు టి.జితేంద్రాచారి, మాది నల్గొండ జిల్లా గోరెంట్ల గ్రామము. విగ్రహారాధన కుటుంబము. మా చిన్నప్పుడు మా అమ్మగారికి ఆరోగ్యం బాగాలేక చాలా బాధపడుచూ ఉండేది. నా చిన్నవయస్సులోనే అనగా 7వ తరగతి చదువుచున్నప్పటి నుండే గుట్కాలు తింటూ, సినిమాలు చూస్తూ నా ఇష్టానుసారముగా బ్రతుకుచూ ఉండేవాడిని. ఒకరోజు మా అమ్మగారికి ఎవరో యేసుప్రభువు గురించి చెప్పి, ప్రార్థన చేయించుకుంటే ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. వెంటనే ప్రార్థన చేయించుకున్న తరువాత ఆరోగ్యం కొంచెం బాగుపడింది. అప్పటి నుండి మా అమ్మ ప్రార్థనకు వెళ్ళుచూ, నన్ను కూడా తీసుకువెళ్ళేది. ప్రార్థనకు వెళ్ళాలనిపించి వెళ్ళేవాడిని కానీ గుట్కాలు మాత్రం మానలేదు. క్రమంగా అలా వెళ్ళుచూ మార్పుచెంది, నా 17వ సంవత్సరములో బాప్తిస్మం తీసుకున్నాను. ఈ విధంగా జరుగుచూ ఉండగా, కొన్ని సంవత్సరముల తరువాత సేవ అంటే ఏమిటో అవగాహన లేకుండానే, సేవ చేయడానికి ఒక పరిచర్యకు వెళ్ళడం జరిగింది. మొదట వాక్యం గురించి ఏమీ తెలిసేది కాదు, అక్కడ ఉన్న వాళ్ళు ఏమి చెప్తే అది చేస్తూ అదే సేవ అనుకునే వాడిని. కొన్ని సంవత్సరముల తరువాత బైబిల్‌లో ఉన్నదానికి బోధించేదానికి పొంతన లేకపోవడం చూచి, వేరే ఏదైనా పరిచర్యకు వెళ్తే బావుంటుందని అనిపించింది. వెళ్ళినా ఒకవేళ అక్కడ కూడా ఏ విధంగా ఉంటుందో తెలియదని అదే పరిచర్యలో కొన్ని సంవత్సరములు పని చేశాను.

తరువాత హైదరాబాద్‌లో ఏదో ఒక పని చేసుకుంటూ, ఏదైనా ఒక మంచి పరిచర్యలో ఉండాలనే ఆలోచనతో వివాహం అయిన తరువాత ఉన్న పరిచర్య నుండి బయటికి రావడం జరిగింది. ఇక్కడికి వచ్చిన తరువాత ఒక చిన్న కంపెనీలో జాయిన్ అయ్యాను. ఒక నెల మాత్రమే ఆ పని ఉంది. పరిచర్య కూడా ఏది బాగుంటుందో తెలియక వారానికి ఒక చర్చికి వెళ్తూ ఉండేవాడిని. పనీ లేదు, ప్రార్థనా లేదు అని చాలా బాధపడుతూ ఉన్నప్పుడు నాకు తెలిసిన ఒక సహోదరుడు నేను ఒక చర్చికి వెళ్ళుచున్నాను, అక్కడ బావుంటుంది, నువ్వు కూడా రా అని నన్ను ఆహ్వానించాడు. నేను వెళ్ళకుండా అశ్రద్ధ చేశాను. మరల ఆ సహోదరుడు ఒకరోజు ఫోన్ చేసి, మాకు వాక్యం చెప్పే ఎపఫ్రా అన్న మా ఇంటికి వస్తున్నారు. వచ్చి కలవమని చెప్పారు. అప్పుడు నేను కూకట్‌పల్లిలో ఉన్నాను, అన్నతో ఫోన్‌లో మాట్లాడాను. నన్ను భాగ్యలతకు రమ్మని చెప్పారు. తరువాత అక్కడకు వెళ్ళి, నా పరిస్థితి అంతా ఎపఫ్రా అన్నతో చెప్పాను. ఒక ప్రక్క పని ఏమీ లేక ఆర్థిక ఇబ్బందులు, ఆత్మీయముగా మంచి సహవాసము లేకపోవడంతో ఆత్మ సంబంధంగా తృప్తి లేని జీవితము

చాలా దుఃఖమును కలిగించింది. అన్న నన్ను ఓదార్చి, ధైర్యపరిచి, ప్రార్థించి పంపించారు. ఆరోజు నుండి ఎపఫ్రా మినిస్ట్రీస్‌లో ప్రార్థనకు వెళ్ళుచూ, బట్టల షాపులో ఉద్యోగం చేసుకుంటూ ఉండేవాడిని.

పరిచర్యలోని క్రమం, బోదించబడుచున్న దేవుని వాక్యము, దాని ప్రకారం నడుచుకోవడానికి చేస్తున్న ప్రయత్నం, యథార్థంగా చూపించే ప్రేమను చూచి ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నాను. అన్నను చూచి ఒక సేవకునిగా ఏ విధంగా సేవ చేయాలి ? సేవ అంటే ఏమిటో తెలుసుకున్నాను. పరిచర్యలో బోధించిన వాక్యము నా విశ్వాసమును అభివృద్ధి చెందించి, వాక్యములో ఉన్న అర్థమును తెలిపింది. కొన్ని సంవత్సరముల తరువాత ఆర్థిక ఇబ్బందులన్నీ తీరిపోయాయి, ఆత్మీయముగా చాలా సంతోషముగా ఉండేది, తెలియని చాలా విషయములను తెలుసుకున్నాను, దేవుని వాక్యం చేత సరిదిద్దబడ్డాను. ఈ విధంగా కొద్ది దినములు గడిచిన తరువాత సేవ చేయాలని మనస్సులో అనిపించి అన్నతో చెప్పాను. అప్పుడు సేవ గురించి కొన్ని విషయములు చెప్పి, ప్రార్థన చేసుకోమని పంపారు. కొంతకాలం తరువాత అన్నయ్య నన్ను పిలిచి ఎపఫ్రా మినిస్ట్రీస్ ఆఫీస్‌లో పని చేయడానికి పంపించారు. అక్కడ నుండి నల్గొండ జిల్లాలోని పెంచికల్‌దిన్నె అనే గ్రామములోని మందిరము దగ్గరకు పంపించారు. ఇప్పుడు అక్కడ దేవుని సేవ చేయడం జరుగుతుంది.

గురి, గమ్యము లేక తిరుగుచూ ఏం చెయ్యాలో అర్థం కాక ఏడ్చుకుంటూ ఉన్న నన్ను చేరదీసి, పరిచర్యలో ఉంచి, నా పట్ల తన కృపను చూపించిన యేసయ్యకు నా వందనములు. సేవ అంటే వాక్యం చెప్పడం మాత్రమే అనుకున్న నేను ఎన్నో విషయములను నేర్చుకొని, నా బలహీనతల నుండి విడిపించబడి, సేవ చేయడానికి కృప చూపిన దేవునికి మహిమ కలుగును గాక ! నేను, నా భార్య నాకు ఇచ్చిన కుమారుడు, కుమార్తె చివరి శ్వాస వరకు అప్పగించిన పనిలో శక్తికి లోపం లేకుండా పని చేసి దేవునిలో నమ్మకంగా ఉండునట్లుగా మా కొరకు ప్రార్థించగలరు.


**ఎపఫ్రా మినిస్ట్రీస్ – వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

**అందరూ ఆహ్వానితులే....!**

వివరములకు:
9666666249 | 040-24202227



# మదర్ తెరీసా

## మదర్ తెరీసా మనోభావాలు

### దైవ ప్రేమ

హృదయపూర్వకంగా, పరిపూర్ణాత్మతో, మనస్ఫూర్తిగా దేవుణ్ని ప్రేమించు – అదేవిధంగా నీ పొరుగువాన్ని కూడా ప్రేమించు. ఇది దైవాజ్ఞ. ప్రేమ అనేది సర్వకాలాల్లోనూ అందరికీ అందుబాటులో వుండేది. ప్రేమకు అంతులేదు. ఎంతైనా పొందవచ్చు. ధ్యానంద్వారా, ప్రార్థన ద్వారా, త్యాగంద్వారా, చిత్తశుద్ధిద్వారా ఈ ప్రేమను ప్రతివారూ అనుభవించవచ్చు.

### ప్రార్థన

ప్రార్థన లేకుండా ఏ సేవనుకూడా తలపెట్టలేం. క్రీస్తు తానెప్పుడూ ప్రార్థిస్తూ తండ్రితో ఆస్తిత్వం పొందేవాడు. అలాగే మనం కూడా క్రీస్తుతో ఏకత్వం పొందాలి. క్రీస్తు మహాశక్తిమంతుడు. ఆయన ప్రేమ మనలో పనిచెయ్యాలని ఆయన అభిలషిస్తున్నాడు. ఎప్పుడైతే క్రీస్తును మనకూ, మనద్వారా ఇతరులకూ చెయ్యనిస్తామో అప్పుడే మన సేవ సార్థకమవుతుంది. మనం పవిత్రంగా వుండాలి. అప్పుడే క్రీస్తు మనలో నివసించడానికి వీలుకలుగుతుంది. మన జీవితం అంతా ప్రేమభరితం కావాలి. విశ్వాసపూరితం కావాలి. పవిత్రమయం కావాలి. నిరుపేదల సేవలో పండిపోవాలి. దేవుని చిత్తమును గ్రహించితే నిరుపేదలు మన పవిత్రతకు కారణభూతులవుతారు

ప్రార్థన మన ఊపిరి. ప్రార్థించే ఆవశ్యకతను మనం గుర్తించాలి. ఏకాగ్రతతో ప్రార్థించాలి. ప్రార్థన మన హృదయాన్ని విశాలం చేస్తుంది. ఆ విశాలంలో దేవుడు ఆశీనుడవుతాడు. నువ్వు ప్రార్థించినకొద్దీ నీ హృదయం విశాలమై దేవుణ్ని అందులో ప్రతిష్ఠించి నీ పరంచేస్తుంది.

### పవిత్రత

దేవుని కృప మీద, మన నిర్మలమైన మనస్సు మీద పవిత్రత అనేది ఆధారపడి ఉంది. పవిత్రంగా ఉండాలన్న దృఢసంకల్పం మనకుండాలి. పవిత్రంగా ఉండాలంటే దేవునికి అయిష్టమైన క్రియలన్నిటిని త్రోసివెయ్యాలి. మన హృదయం చుట్టూ అడ్డుగా నిర్మించుకున్న వాటన్నిటిని కూలద్రోయాలి. నా మనస్సుకు, రాగద్వేషాలకు, కోరికలకు స్వస్తి చెప్పి – దైవ చిత్తానికి బానిసనవ్వాలి. ఈ భావన కలిగినప్పుడే పవిత్రత ఏర్పడుతుంది. దేవుని చిత్తాన్ని చిరునవ్వుతో జరిగించడమే నిజమైన పవిత్రత.

## సమర్పణ

ఆయన నీకేది ఇస్తాడో దాన్ని స్వీకరించు; ఏది తీసుకుంటాడో దాన్ని సమర్పించు.

## విశ్వాసం

దేవుడిచ్చే వరాలలో విశ్వాసం ఒకటి. విశ్వాసంలేకపోతే అసలు జీవితమే లేదు. మన సేవ ఫలభరితం కావాలి. దేవునికది అందమైన పనిగా మారాలి. ఇలా జరగాలంటే మన పనికి విశ్వాసం ఆయుపట్టు కావాలి.

## సేవ

దేవుడున్న చోట ప్రేమ ఉంటుంది. ప్రేమవున్న చోట సేవ ఉంటుంది.

## ప్రేమ పలకరింపు

ఆస్తిపరులుకూడా ప్రేమకు అర్రులుచాచేవారే. ప్రేమకోసం తపించిపోయే వాళ్లే. ప్రేమానురాగాలతో పలకరించే తమ వాళ్లు తమకుండాలని ఆశిస్తారు.

## ప్రేమ క్రియలు

పరులతో పంచుకోలేని ప్రేమకు అర్థంలేదు. ప్రేమ క్రియల్లో కనిపించాలి. ఇతరుల దగ్గరనుంచి ఏదో ఆశించి ప్రేమను ప్రదర్శించకూడదు. ఫలాపేక్షలేనిదే స్వచ్ఛమైన ప్రేమ.

## దైవసన్నిధి

సర్వదా దేవుని సన్నిధానం మనతో ఉన్నదని ధ్యానించడమే మన ధ్యేయం. అతి స్వల్పమైన విషయాలలో కూడా దేవుని ఉనికి మనకవసరం. అందులో కూడా ఆ ప్రేమామయుడు ప్రత్యక్షమౌతూనే ఉంటాడు.

## ఇరుగుపొరుగు

ముందుగా మనకు దగ్గర్లో ఉన్నవారిని ప్రేమించడం నేర్చుకోవాలి. అది మన ఇంట్లోనే మొదలవ్వాలి. అప్పుడే ఇరుగు పొరుగు వారిని ప్రేమించగలుగుతాం.

## జీవితాశయం

ప్రేమించడం అనేది మన జీవితాశయం. అది మన కర్తవ్యం. మనం మరణించి దేవుని సన్నిధానంలో చేరినపుడు మనకు తీర్పు జరుగుతుంది. ఎన్ని పనులు చేశామన్నది లెక్కకురాదు. ఎంత ప్రేమతో ఆపనులు చేశామన్నదే లెక్క. దేవుని తీర్పు దీనిమీదనే ఆధారపడి ఉంటుంది.

## పరిచర్య

ప్రార్థన ద్వారా విశ్వాసం, విశ్వాసం ద్వారా ప్రేమ, ప్రేమ ద్వారా పరిచర్య ప్రాప్తిస్తాయి

## దయ

దయాదాక్షిణ్యం మనిషి కుండాల్సిన ముఖ్య లక్షణం. నీ దగ్గరకొచ్చేవాళ్ళు సంతోషంగా వెళ్ళేటట్టుచూడు. దేవుని దయకు సజీవ ప్రతీకగావుండు. నీ ముఖంలో, నీ కళ్ళల్లో, నీ నవ్వులో దయ కనిపించాలి.

మురికి వాడల్లో సేవ చెయ్యడానికి మనం వెళ్తుంటాం. అలాంటి సమయాలలో మనం దేవుని దయకు ప్రతీకలం, చీకటిలో వెలిగే కాంతి కిరణాలం. బాధపడే పిల్లలకూ, పేదవాళ్లకూ మనం ఉల్లాసంగా కనిపిస్తూ, చిరునవ్వులు అందించాలి. కేవలం శ్రద్ధచూపితే చాలదు. మన హృదయాన్ని వాళ్ళకివ్వాలి.

## ఆనందం

ప్రార్థనే ఆనందం... శక్తి ఆనందం... ప్రేమే ఆనందం అనేది ప్రేమపూరితమైన వలలాంటింది. అది ఎన్నో జీవాత్మలను పడుతుంది. ఆనందంగా యిచ్చేవాళ్ళను దేవుడు ప్రేమిస్తాడు. ఆనందంగా ఎవరిస్తారో వాళ్ళే ఎక్కువ ఇచ్చినట్టు. మనకు ఎదురయ్యే ప్రతి సమస్యనూ, ప్రతి విషయాన్ని ఆనందంతో స్వీకరించడమే దేవునికి స్తుతిచెల్లించడం.

నీ మనస్సులో ఏ విషయాన్నీ నీ సమస్యనూ తిష్టవెయ్యనీకు – అలా చెయ్యడం వల్ల పునరుత్థానుడైన క్రీస్తు నీకు అందించే ఆనందానికి దూరమయ్యే ప్రమాదముంది !

## దేవుని నమ్ముకో ...

దేవున్ని నమ్ముకో, నిన్నొదిలిపెట్టడు. నీ పనికి అన్నీ సమకూర్చుతాడు. అలా జరగకపోతే ఆ పని ఆయనకు ఇష్టం లేదన్నమాట.

## శ్రమ

శ్రమపడకుండా సేవచేస్తానంటే అది కేవలం మెప్పుకోసం చేసేది మాత్రమే అవుతుంది. అది యేసుక్రీస్తు సేవ అనిపించుకోదు. ఆయన ప్రసాదించే విముక్తి అనిపించుకోదు. యేసు – మన జీవితాన్ని, మన ఒంటరితనాన్ని, మన ఆవేదనని, మన చావునూ పంచుకుని తాను సేవ చేశాడు. మనలో ఒకడిగావుండి మనకు విముక్తిని ప్రసాదించాడు. మనం కూడా అలాగే చెయ్యాలి. దిక్కుమాలిన ప్రజలకు సన్నిహితంగావుంటూ, వాళ్ళ దారిద్ర్యంలో మనం భాగం పుచ్చుకుంటూ వాళ్ళ ఆధ్యాత్మిక దారిద్ర్యాన్ని తొలగిస్తూ – దేవున్ని వాళ్ళ జీవితాలలో ప్రవేశ పెట్టాలి.

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

**విన్నపము మరియు కోరిక :-**

సామాన్యంగా మనవి అనునది కోరికపై ఆధారపడి ఉంటుంది. మన శరీర కోరికలకు నిజ హృదయ కోరికలకు తేడా తెలుసుకొనవలసిన వారమైయున్నాము. ఆయన యందు మనము ఆనందిస్తే, ఆయన మన హృదయ వాంఛలను తీరుస్తారని బైబిలు చెప్తుంది (కీర్తన 37:4) కాని, మనము దేవుడు ఇవ్వని, శారీరక, ప్రకృతిపరమైన కోరికలు కలిగి ఉంటాము. అవి తీరుస్తానని దేవుడు చెప్పలేదు. వాటిని ఆయనకు చెప్పి, అలా వాటిని వదిలివేయటం అటువంటి కోరికలకు మనం సరిగా స్పందించే తీరు. కొన్నిసార్లు కొన్ని ప్రార్థనలకు ఎందుకు జవాబు ఇవ్వబడట్లేదు అంటే అవి మన శారీరక కోరికలై ఉండి, ఆత్మచే నడిపించబడనివై ఉంటాయి. (యాకోబు 4:3)

మన కోరిక హృదయానికి సంబంధించినదో లేక శరీరమునకు సంబంధించిందో ఖచ్చితంగా చెప్పలేకపోతూ ఉంటాము. అటువంటి సమయములలో, ప్రభువు మంచి వాడని మనలను ప్రేమించి, మంచివాటిని ఇస్తారు అని గ్రహించి ఆయనకు ఇష్టం లేని దాని కోసం ప్రాకులాడటం అనవసరమని, ఉత్తమమైనవి తండ్రికి తెలుసు అని దేవునికి వదిలివేయాలి.

మనకు ఏమి కావాలో ప్రార్థించునప్పుడు, పరిశుద్ధాత్ముని అనుసరించుచూ, ఒకవేళ అవి జరగనప్పుడు ఏమి చేయాలో, ఎలా ఉండాలో నేర్పించుటకు ఆయనను ఆహ్వానించ వలసి యున్నది. మన కోరికలు సమతుల్యాన్ని కోల్పోయి, వ్యసనములుగా మారకుండా చూచుకోవాలి. వ్యక్తిగతంగా ఏ కోరిక కూడా మనలను నియంత్రించకుండా, ముఖ్యంగా వ్యామోహంగా మారకుండా చూచుకోవాలి. వ్యామోహంఒక పాపం అనగా క్రీస్తుకన్నా, ఆయన సన్నిధి కన్నా ఎక్కువైనది ఏదీ మన జీవితములో ఉండకూడదు. ఈ లోకములో ఏదీ కూడా క్రీస్తు లేకుండా మనకు సంతోషాన్ని ఇవ్వదు.

ఒక కోరిక సమతుల్యం కోల్పోవడం అంటే ఎలా ఉంటుందన్న దానికి ఒక ఉదాహరణ:- పెళ్ళి చేసుకోవాలి అన్నది తప్ప మిగిలిన వాటిని గురించి ఆలోచించలేని కొందరు, ప్రార్థనలో వివాహముల గురించి దేవుని అడుగుతారు. ప్రార్థనా గుంపును ప్రార్థించమని అడుగుతారు, అన్ని సమయములలో ఈ విషయం గురించే వారు మాట్లాడుతూ ఉంటారు. నిరాశ, నిస్పృహలకు లోనౌతారు. పెళ్ళి చేసుకునే వరకు తాము సంతోషంగా ఉండలేమని నిర్ణయించుకుంటారు. ప్రభువా - "నేను పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నాను" అని అడుగుటలో తప్పు లేదు. నిజమే ఇటువంటి విషయములను

గురించి ప్రార్థించవచ్చు, కాని ఒక్క కోరికపై మన జీవితములు కేంద్రీకృతమవ్వకుండా జాగ్రత్తపడుచూ, శ్రద్ధ కలిగి ఉండాలి. దేవుని సేవించుటలో, లోబడుటలో దృష్టి కేంద్రీకరించి, ఇతరులకు ఆశీర్వాదకరంగా ఉండుటలో దృష్టి పెట్టాలి. అప్పుడు సరియైన సమయములో దేవుని చిత్తం మన జీవితములో నెరవేరుతుంది. పోరాడి, నిరాశపడి లేక కలవరపడవలసిన అవసరం ఉండదు. వెళ్ళుచున్న మార్గములో సంతోషంగా ఉంటాము.

ఏదైనా కోరికను దేవుని అడుగుచున్నప్పుడు, మనం సరైనదే అడుగుతున్నామని, అనుకుంటాము కానీ, ఆ కోరికను తీర్చాలా, వద్దా అనేది దేవునికి తెలుసు. అమాయకత్వంతో మనకు చాలా అపాయకరమైన దానిని కూడా గ్రహించకుండా అడుగుతాము. ఆ సమయములో అది మనకు ఇవ్వనందున సంతోషించాలి. మనకి ఏది మంచిదో అదే మన తండ్రి మనకు అనుగ్రహిస్తారు అని నమ్మాలి. అంతేగానీ అడిగిన ప్రతీది ఇవ్వనందు వలన చెడు ఉద్దేశ్యం గానీ, బాధ కానీ కలిగి ఉండకూడదు.

ఆయన బిడ్డలమైన మనం ఆశీర్వదింపబడాలని దేవుడు కోరుతున్నాడు. కేవలం మనం కోరుకున్నవే కాకుండా, మనకి ఏది ఉత్తమమో, మనం దానిని కలిగి ఉండాలని దేవుడు ఇష్టపడుతున్నారు. కాబట్టి మనం మనవులు చేయు ప్రతిసారీ దీనిని మనసులో ఉంచుకొని దేవుని నిజంగా నమ్మాలి. ఆయన “అవును” అని చెప్పినప్పటిలానే, మన మనవులకు “కాదు” అని చెప్పినప్పుడు కూడా నమ్మాలి. రాజైన దావీదు దేవుని కొరకు ఒక దేవాలయమును కట్టాలని చాలా ఆశపడ్డాడు. దేవుడు అతని కొడుకు దేవాలయమును కడతాడని చెప్పాడు. దావీదు చెడుగా భావించలేదు కనీసం బాధపడలేదు, బదులుగా దేవాలయం కొరకు అవసరమైన వస్తువులను ఇతరుల నుండి సంపాదించుటలో తీరిక లేకుండా సహాయ పడ్డాడు. చేశాడు.

ఖచ్చితంగా మనం కోరుకున్నదే దేవుడు ఇవ్వకపోయినట్లయితే, ఆయన ఏది అంగీకరిస్తారో కనుగొని, ఆ పని చేయుటలో నిమగ్నమవుదాము. అంతే కాని దేవుని మార్గాలు అర్థం కాని అయోమయ స్థితిలో జీవితమును గడపవద్దు. మనం దేవుని అర్థం చేసుకోవడం కాదు, నమ్మవలసి ఉన్నది. మన జీవితములో జవాబు లేని కొన్ని ప్రశ్నలకు నమ్మకం కంటే గొప్ప జవాబు లేదు.

సేకరించబడింది (జాయిస్ మేయర్)

ఇంకా ఉంది

# అంతరంగపు కథ

ఒకానొక దినం సాయం సమయములో ఆత్మ అనే పేరు గల మనుష్యుడు తోటలో నడుచుకుంటూ వెళ్తూ, తన రక్షణ వలన కలిగిన ఆనందముతో పాటలు పాడుకుంటూ ఉన్నాడు. అతడు నూతనముగా మారుమనస్సు పొందిన వ్యక్తి. ఆత్మ నడుస్తూ ఉండగా అందం, ఆకర్షణ గల స్త్రీ చెట్టు చాటు నుండి రావడం కనిపించింది. ఆత్మ ఒక్కసారిగా ఉలిక్కిపడి

హలో! నేను ఆత్మను, నీ పేరేమిటి? అని అడిగాడు. నన్ను మోహం అంటారు. నేను నీకు కావలసినదానిని అని సమాధానం చెప్పింది.

**ఆత్మ :-** నాకు నువ్వు ఎలా కావలసిన దానివి?

**మోహం:-** చాలా విధాలుగా కావలసిన దానిని, శరీర సంబంధమైన వాంఛలన్నీ తీర్చుకోవచ్చు.

**ఆత్మ :-** సరే నన్ను నడిపించు.

అప్పుడు శరీరసంబంధమైన వాంఛలన్నీ తీర్చుకోవడానికి మోహం సహాయపడింది. ఆ తరువాత ఆత్మ తోట నుండి తిరిగి వచ్చినప్పుడు దోషారోపణ అనే వ్యక్తి వచ్చి కలవడం జరిగింది.

**దోషారోపణ:-** ఏయ్! నా ఫ్రెండ్ మోహముని నువ్వు కలుసుకున్నావా?

**ఆత్మ :-** అవును, నీవెవరివి?

**దోషారోపణ:-** నన్ను దోషారోపణ అంటారు. మోహము తరువాత నేను వస్తాను. మేమిద్దరము ఒకరితో ఒకరము చక్కటి అవగాహనతో పని చేస్తూ ఉంటాము.

దోషారోపణ, ఆత్మ వీపు పైకి ఎక్కి కొట్టడం ప్రారంభించాడు. మొఖం మీద పిడిగుద్దులు గుద్దాడు. ఇలా జరుగుతూ ఉండగా, సుమారు మూడు దినముల తరువాత కనికరము అనే వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చి ఆత్మని కొట్టడం ఆపమని దోషారోపణని గద్దించాడు. దోషారోపణ చూసుకుందాము రా అని అన్నాడు. అప్పుడు కనికరము తన ఒరలో ఉన్న కత్తిని తీసి, దోషారోపణని రెండు ముక్కలు చేశాడు. వెంటనే ఆత్మ తనలో ఉన్న బాధ నుండి బయటపడడం జరిగింది. కనికరం ఆత్మ దగ్గరకి వెళ్ళి దోషారోపణని నేను జయించాను, అతను నీకు ఎన్నడూ కనిపించడు అని చెప్పాడు.

**ఆత్మ:-** నేను నీకు ఎలా కృతజ్ఞతలు తెలపాలో తెలియడం లేదు.

**కనికరం :–** మంచిది, ఇక్కడికి నేను దేవుని చేత పంపబడ్డాను, ఆయన నా స్నేహితుని నీకు పరిచయం చేయమని చెప్పాడు. ఇదిగో అతని పేరు విడుదల.

**విడుదల :–** హలో, ఆత్మ! అంటూ దగ్గరకి వచ్చి, నువ్వు సరిగా ఉండలేకపోతున్నావు కదా ! అంటూ అడిగాడు.

**ఆత్మ :–** నిన్ను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది.

**విడుదల:–** నాకు కూడా నిన్ను కలుసుకోవడం సంతోషంగా ఉంది. నువ్వు నన్ను అంగీకరిస్తావా?

**ఆత్మ :–** ఏమంటున్నావు?

**విడుదల:–** నువ్వు యేసయ్యని అంగీకరించినప్పుడు, ఆయనతో నడవాలని నిర్ణయించుకున్నావు. తరువాత ఆయన ప్రేమను, ఆజ్ఞలను అంగీకరించావు. నేను ఆయన ప్రేమలో భాగమును, క్షమించబడ్డాను అనే భావమును కలిగిస్తాను. ఇక నీవు ఎన్నడూ దోషారోపణ చేత బాధించబడవు. మోహము నీ చుట్టూ తిరిగినప్పటికి, నాలాంటి మరో వ్యక్తి నీకు సహాయం చేస్తాడు. అతని పేరు "కృప"

**కృప:–** ఆత్మతో నడుస్తూ, నేను నీ కోసం ఎదురుచూస్తున్నాను, నేనే కాదు, మేము ముగ్గురము నిన్ను కలవాలని ఎదురు చూస్తున్నాము. మోహము నుండి దూరము చేయడానికి నన్ను నీకు దేవుడు అనుగ్రహించాడు. చివరిగా మరొక వ్యక్తిని నువ్వు కలుసుకోవాలి అతని పేరు 'విశ్వాసము'

**విశ్వాసము:–** ఆత్మా! నేను విశ్వాసమును, నువ్వు బలపడాలని, నీ నమ్మికలన్నీ దృఢపడడానికి నేను నీకు సహాయం చేస్తాను.

ఆత్మ ఏడవడం ప్రారంభించాడు.

ఇంతలో విడుదల ఈ విధంగా అన్నాడు :– దీని కోసమే నీతో మేము ఉన్నాము. యేసు విడిపిస్తాడు. కృప చేత, విశ్వాసము ద్వారా రక్షిస్తాడు. నిన్ను ఆయన కనికరముతో ప్రేమిస్తాడు.

**ఆత్మ:–** "నేను యేసును ప్రేమిస్తున్నాను"

ప్రియమైన చదువరీ! మనం ఎంత బలహీనులమైననూ, ఎన్ని అపజయములు పొందిననూ, దేవుని నుండి దూరంగా పారిపోకూడదు. ఏది ఏమైననూ ఆయనను హత్తుకొని జీవించవలయును. దేవుని ప్రేమ మానవుల పట్ల షరతులు లేనిది.



# బైబిల్ క్విజ్ -40

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.
(యెహోషువ నుండి ఇవ్వబడినవి)

**1.** ఏ గుహలో ఐదుగురు రాజులు దాగియుండిరి?
**2.** ఇశ్రాయేలీయల భయముచేత ఎవరికి ధైర్యము లేకపోయెను?
**3.** ఇశ్రాయేలీయులు యెహోషువకు ఇచ్చిన స్వాస్థ్యమేది?
**4.** ఆమె తండ్రిని పొలము అడగమని భర్తని ప్రేరేపించిన స్త్రీ ఎవరు?
**5.** యెహోషువ ఇశ్రాయేలీయులతో ఎక్కడ నిబంధన చేసి కట్టడను విధిని నియమించాడు?
**6.** ఇశ్రాయేలీయుల నుండి ఐగుప్తు అవమానాన్ని దేవుడు ఎక్కడ దొర్లించాడు?
**7.** ఆశ్రయపురముల పేర్లు వ్రాయుము?
**8.**ఎవరి పాపం వలన కుటుంబమంతా శిక్షించబడింది?
**9.** యెహోషువ మరణించినప్పుడు అతని వయస్సు ఎంత?
**10.** యొర్దాను నది నీళ్ళు ఒక రాశి వలె ఎక్కడ నిలబడ్డాయి?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు జూన్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు జూలై 2015 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 39 జవాబులు (ద్వితియోపదేశకాండము) :**

1. పిస్గా కొండ దగ్గర నెబోశిఖరం (34:1)
2. శేయీరు ప్రజలు (2:6)
3. లంచము (16:19)
4. నూర్చెడి యెద్దు (25:4)
5. హెర్మోను (4:48)
6. యెహోవా (33:2)
7. లేవీ (10:9)
8. బెన్యామీను (33:12)
9. అరాబా సముద్రం (3:17)
10. మోషే (34:12)

**బైబిల్ క్విజ్ - 39 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

ఐజాక్ కుమారి, వాసవ్య, రాజు ఫ్లోరెన్స్, కవితా మాధురి, విఠల్, స్టెఫన్, సుశీల, సౌజన్య, నీతా, జాన్‌పాల్, సుధారాణి, లావణ్య, పూర్ణజ్యోతి

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మే - జూన్

**భాగ్యలత** : మణి, శిరీష, మేరీరత్నం, గోపాలం, జయంతి, జగన్, సాయిలత, అశోక్‌కుమార్, వెంకటేష్, రమేష్, డేనియల్‌రాజ్, భీమశంకర్రావు, అరుణ్‌కుమార్, జ్యోతి, సుజాత, శ్రీలత, మల్లిక, గ్లోరియరాజు, శ్రీలక్ష్మి, రవితేజ, మధురిమ, సుశాంతి, హారిక, మార్త, శామ్యూల్, శారా, రాజేష్, గౌతమి, వాణి, నాగరాజు, సుధ, మాధవి, రూతు, సలోమి, మేఘన, బసవపూర్ణమ్మ, నవ్య, అంజలి, శేఖర్‌బాబు, సాయికుమార్, సద్గుణ, రఫీ, శారదాకుమారి, రాజేష్, దుర్గాప్రసన్న, సిల్వకుమార్, మేరీఫాతిమా, పూజ, అమలాజ్యోతి, ఆశ, మానస, తిరుపతిరావు, మనోజ్, జాషువా, ప్రవల్లిక, నితేష్, వీరలింగం, మధుసూధనరెడ్డి, విజయనందన, నవ్యక, కృపాజ్యోతి, రామకృష్ణ, రాజేశ్వరి, మనూజ, జయరాజు, ఫిలిప్పు, మన్యం, గాయత్రి, సూర్యప్రభ, లక్ష్మి, గిద్యోను, ప్రీతి, దానియేల్, రోసీప్రకాష్, శాంతి, నందిని, ఫ్రాన్సిస్, నవీన, వెంకటేశ్వర్రావు, కౌముది, గీత, అవినాష్, వసంతరాణి, ఆనంద్‌రాజ్, అనిత, గాయత్రి, శేషగిరి, విజయకుమారి, హేమాంబరావు, కనకదుర్గ, విజయలక్ష్మి, సంధ్యారాణి, జోజిబాబు, సుబ్బారావు, శైలేష్, ఆదిలక్ష్మి, లావణ్య, వెంకట్, శ్రీను, కృష్ణకళ్యాణ్, బాబు, శేఖర్, వివేక్, ప్రియాంక, విజయలక్ష్మి వర్మ, మధుబాల, వినయ్‌కుమార్, అనిల్‌కుమార్, ప్రశాంతి, కిరణ్, గీతాసాత్విక, మమత, ప్రశంస, శేఖర్ (సింగపూర్)

**చింతల్ :** విజయ, సాత్విక్, శామ్సన్, జగన్‌మోహన్‌రావు, సాల్మన్, నిహారిక, జీవా, రమ్య, శ్రీనివాసరావు, అనూష, రమ, గోపీచంద్, ఐజాక్‌కుమారి, రవీందర్, కృపారాణి, ఎలిజబెత్, జాన్సన్, సురేష్‌బాబు, స్వర్ణలత, మల్లేశ్వరి, సంధ్యారాణి, సునీత, ఆనందకుమార్, బాబూరావు, వెన్నెల, అభిషేక్, బెంజిమన్, రాధాకృష్ణ, నిర్మల, ప్రశస్థ, ఎస్తేరు రాణి, దేవకిరణ్, సురేంద్ర, రూతమ్మ, జీవమణి, విజయ్

**అనాజ్‌పూర్ :** జీవన్‌కుమార్, మృణాళిని, మహాలక్ష్మి, ఆంద్రెయ, జోషువా, నరసింహ, రాజ్‌కుమార్, రత్నాకర్, కారుణ్య, సుజిత్‌కుమార్, మరియమ్మ, మేరిసియోనా, సుదినషారోన్,

**ఇ.సి.ఐ.యల్ :** విజయ్‌కుమార్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

మీ ప్రార్థనావసరతలు:

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

 **చక్కగా మాట్లాడటం మహా కళ కానీ చెప్పేది వినడం అనే కళ దాని కన్నా విలువైనది, అరుదైనది.**



2015, ఏప్రిల్ 3వ తేది జరిగిన గుడ్‌ఫ్రైడే ఆరాధనలో అనేకులు
పాల్గొని దేశం కొరకు ప్రార్థించడం జరిగినది.

## 2015, మే 1వ తేది జరిగిన ఉపవాస ప్రార్థనలోని ఛాయాచిత్రములు






# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras